TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య   సంపుటి 1  సంచిక 31   ప్రింటర్ : గుండూర్ శ్యామ్ .  గురువారం 18 డిసెంబర్ 2025   వెల 4:00

## గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుంటే..
## కృష్ణా నదిలోకి లారీ!



**వనపర్తి, డిసెంబర్ 17 (నిజాయితీ):**
తెలియని ప్రాంతానికి వెళ్లేటప్పుడు గూగుల్ మ్యాప్స్‌పై ఆధారపడటం సాధారణమైంది. అయితే ఆ యాప్ ఒక్కోసారి ప్రమాదాలకు కారణమవుతుందనే విషయం మరోసారి రుజువైంది. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలో గూగుల్ మ్యాప్స్ చూపిన మార్గాన్ని నమ్మిన లారీ డ్రైవర్ కృష్ణా నది ఒడ్డుకు చేరి షాక్‌కు గురయ్యాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని బేతం చెర్ల నుంచి బండల లోడుతో తెలంగాణలోని మక్తల్‌కు లారీ వెళ్తోంది. డ్రైవర్ జాతీయ రహదారి 44 మీదుగా కొత్తకోట వరకు సురక్షితంగా చేరాడు. ఆ తర్వాత దారి తెలియక గూగుల్ మ్యాప్స్‌ను ఆన్ చేసి ఆత్మకూర్ మీదుగా మక్తల్‌కు వెళ్లేందుకు ప్రయత్నించాడు.

తెల్లవారుజామున ఆత్మకూర్ చౌరస్తా వద్ద టర్నింగ్ తీసుకోవాల్సి ఉండగా, గూగుల్ మ్యాప్స్ సూచన మేరకు నేరుగా ముందుకు వెళ్లాడు. అలా జూరాల గ్రామం వైపు సాగాడు. కొంత దూరం వెళ్లాక ముందుగా నీళ్లు కనిపించడంతో అనుమానం వచ్చి లారీ దిగి పరిశీలించగా, రోడ్డుకు బదులుగా కృష్ణా నది ఉన్నట్లు గుర్తించాడు.

ఇంకా కొద్ది దూరం వెళ్లి ఉంటే లారీ నేరుగా కృష్ణా నదిలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉండేది. అప్పటికే లారీ నది తీరంలోని ఘాట్ వరకు వెళ్లడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది.

## ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు డిస్మిస్.!

### - పార్టీ మారినట్లు ఆధారాలు లేవు.- స్పీకర్ ప్రసాద్‌కుమార్ కీలక తీర్పు.

**హ×దరాబాద్, డిసెంబర్ 17 (నిజాయితీ) :**
పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ బుధవారం కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి పక్కా ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో స్పష్టం చేశారు. దీంతో ఈ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది.
బీఆర్ఎస్‌కు చెందిన తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై పార్టీ మారినట్లు ఆరోపణలు చేస్తూ దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం, పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలు లేవని పేర్కొంటూ అనర్హత వేటుకు వీరు అర్హులు కాదని తీర్పు ఇచ్చారు.
సాంకేతికంగా ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని ఎమ్మెల్యేలు తమ వాదనల్లో పేర్కొన్నారు. అలాగే తమ వేతనాల నుంచి కట్ అయ్యే డబ్బులు ఇప్పటికీ బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఖాతాలోనే జమ అవుతున్నాయని తెలిపారు.
మొత్తంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేలు మారారని ఆరోపిస్తూ 10 మందిపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఎనిమిది మందికి సంబంధించిన విచారణను స్పీకర్ పూర్తిచేయగా, ఐదుగురిపై తీర్పు వెలువడింది. మిగిలిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్‌కుమార్ పిటిషన్లపై గురువారం తీర్పు వెల్లడించనున్నారు.
మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్ల విచారణ ఇంకా పూర్తికాలేదు. వారు విచారణకు మరింత సమయం కోరడంతో స్పీకర్ నిర్ణయం వాయిదా పడింది. అయితే అనర్హత పిటిషన్లపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఈనెల 19లోగా ఆదేశాలు జారీ చేయడంతో, ఈ రెండు కేసులపై స్పీకర్ తీర్పు ఎలా



## స్నేహితుని బర్త్‌డేకు వెళ్తూ..
## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 16 (నిజాయితీ) :**
స్నేహితుని పుట్టిన రోజు వేడుకలుకు హాజరు కావడానికి వెళ్తు యువకుడు మృత్యువు ఒడిలోకి వెళ్ళాడు వివరాలలోకి వెళితే.. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన గుర్రం శరత్ రెడ్డి (20) అనే యువకుడు మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని మెడికవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు,గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన శరత్ రెడ్డి సోమవారం తన మిత్రునితో కలిసి తన బైక్ పై రేపాక నుండి కరీంనగర్ లో తన స్నేహితుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్గునూర్ లో స్కూటీ ఎదురు వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో శరత్ రెడ్డి కిందపడడంతో తలకు బలమైన గాయమై రక్త స్రావం జరిగింది.

## కిషన్ రెడ్డి తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం: మహేష్ కుమార్

ఢిల్లీ: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముద్దాయిగా నిరూపించబడ్డారని శిక్ష తప్పదని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫార్ములా- ఈ కార్ రేసులో కెటిఆర్ తప్పు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..మూసి సుందరీకరణను బిఆర్ఎస్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దు అని సూచించారు. తెలంగాణకు కిషన్ రెడ్డి తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. కేంద్రం దగ్గర బిసి బిల్లు ఎందుకు పెండింగ్ లో ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రయత్నిస్తే బిసి బిల్లు ఆమోదం పొందుతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## వచ్చే ఏడాది చివరికి శాటిలైట్ టోల్ వసూళ్లు



వచ్చే ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా శాటిలైట్ ప్రాతిపదిక టోల్ టాక్స్ వసూళ్లు విధానం అమలులోకి వస్తుంది. ఈ విషయాన్ని రాజ్యసభలో బుదవారం కేంద్ర జాతీయ రహదారులు, రవాణా , పోర్టుల మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. శాటిలైట్ ద్వారా వినూత్న అధునాతన సాంకేతికత వినియోగం వల్ల టోల్‌ప్లాజాల వద్ద పన్నుల వసూళ్ల జాప్యం తగ్గుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని ఆయన వివరించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు తుదిరూపంలో ఉంది. శాటిలైట్ల ద్వారా పనిచేసే ఈ విధానంలో ఎఐ వాడకం కూడా ఉంటుంది. దీని వల్ల టోల్ టాక్స్‌ల వసూళ్లు వేగవంతం అవుతాయని వివరించారు. ఇంధనం వనరులు రూ 6000 కోట్ల మేర ఆదా అవుతుంది. ప్రభుత్వ రాబటి పెరుగుతుంది. పైగా టోల్ ప్లాజా వద్ద క్షణకాలంలో వసూళ్లు జరిగిపోతాయని వివరించారు. 2026

## ఏనుగుల దాడిలో ఐదుగురి దుర్మరణం



**జార్కండ్, డిసెంబర్ 17 (నిజాయితీ) :**
జార్కండ్‌లోని అంగారా ప్రాంతపు జిదూ గ్రామంలో అడవి ఏనుగుల స్వైర విహారంతో ఐదుగురు వ్యక్తులు బలి అయ్యారు. వాటి ధాటికి మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు.గడిచిన 24 గంటలలో ఈ మదపుటేనుగుల అరాచకంలో ఈ ఘటనలు జరిగాయి. అదుపు తప్పిన ఏనుగులు వేర్వేరు చోట్ల చెలరేగాయి. ఈ క్రమంలో తమ ముందుకు వచ్చిన వారిపై ఘీంకరిస్తూ కిందపడేసి తొక్కివేశాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో మదపుటేనుగుల గుంపు తిరుగుతోంది. పంట పొలాలపై పడి ధ్వంసానికి దిగుతున్నాయి. తరిమికొట్టేందుకు యత్నించే వారిని లేదా తమ కండ్ల ముందుకు వచ్చిన వారిపై దాడికి దిగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏనుగుల మంద కోసం అటవీశాఖాధికారులు గాలిస్తున్నారు. మృతులలో ఇద్దరు ముసలివారైన మహిళలు ఉన్నట్లు వెల్లడైంది. ఇకీ ప్రాంతంలో స్థానికంగా బొగ్గు గనుల కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే రజ్వార్ ఈ ప్రాంతంలో తిరుగుతున్న ఏనుగుల మంద వీడియో చిత్రీకరించేందుకు , పైగా సెల్ఫీకి దిగేందుకు ప్రయత్నించి చావు కొని తెచ్చుకున్నాడు. ఈ ప్రాంతంలో 42 గజాలు మందలుగా విడిపోయి అడవులు వీడి, పల్లెలపై పడుతున్నాయి. దీనితో అనేక చోట్ల భయాందోళనలు అలుముకున్నాయి.


## ఆధ్యాత్మికత మనుషుల మధ్య ఐక్యతకు పునాది.!

- అయ్యప్ప కటాక్షం అందరిపై ఉండాలి
- స్థానిక ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి.



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 17 (నిజాయితీ) :**
ఆధ్యాత్మికమైన కార్యక్రమాలు మనిషికి మనిషికి మధ్య ఐక్యతకు, క్రమశిక్షణకు బలం చేకూరుతుందని అయ్యప్ప స్వామి కరుణాకటాక్షం ప్రజలందరిపై ఉండాలని, ఆయన ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రం హౌసింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మహాపడి పూజ మహోత్సవం కార్యక్రమానికి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సద్భావన, క్రమశిక్షణ, ఐక్యతను బలపరుస్తాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రమణ రావు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మహాపడి పూజ మహోత్సవం ఘనంగా ముగిసింది.

## మూడవ దశలో పంచాయతీ ఎన్నికల్లో హస్తం పార్టీ హవా



**మక్తల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మెజారిటీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కైవసం. ఫలితాలపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి వాకిటి శ్రీహరి. రేపు మక్తల్ పట్టణంలో ద్వారక ఫంక్షన్ హాల్లో గెలిచిన వార్డు సభ్యులు,సర్పంచ్లను ఘనంగా సత్కరించనున్న మంత్రి వాకిటి శ్రీహరి. రెండవ దశలో జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు, అమరచింత మండలాల్లోనూ అధిక స్థానాలు కాంగ్రెస్ కైవసం**

**మక్తల్, డిసెంబర్ 17 (నిజాయితీ) :**
మక్తల్ నియోజకవర్గంలో జరిగిన మూడవ దశలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించడం పట్ల పశు సంవర్ధక,పాడిపరిశ్రమాభివృద్ధి,మత్స్య,క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు.మూడవ దశలో నియోజకవర్గంలో 5 మండలాలకు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మెజారిటీ స్థానాలు సాధించారు.రెండవ దశలో జరిగిన ఎన్నికల్లోనూ ఆత్మకూరు,అమరచింత మండలాల్లోని మెజారిటీ స్థానాలు సాధించడం జరిగింది.ఈ సందర్భంగా గెలిచిన వారికి మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పల్లె అభివృద్ధి చేయాలని కాంక్షిస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకొని వెళ్తూ, గెలిచినవారు అందరూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

